


"కరుణా ! వెళ్ళగానే ట్రంకాల్ చెయ్యి మరిచిపోకుండా."

ఆనందరావ్ కిటికీ కమ్మీ పట్టుకున్న కరుణ చేతిని ఆప్యాయంగా నొక్కాడు. ఆ స్పర్శలో వయసు వేడి లేదు. వలపు ఉధృతం లేదు. అయినా వారి మధ్య ఉన్న బంధం నిన్న మొన్నలలో పెనవేసుకున్నదైతేగా? దాదాపు పాతికేళ్ళ వైవాహిక జీవితం అనుభవించిన జంట వారిది. సుదీర్ఘంగా సాగిన వారి దాంపత్యపు రోజులలో అలకలూ, చిరాకులూ లేనేలేవు. ఉన్నదంతా సంతోషపు కెరటాల చిరునవ్వుల తుంపరలే.

"జాగ్రత్తగా వెళ్ళు. పడుకునే ముందు టాబ్లెట్ వేసుకో రోజూ." బస్సు బయల్దేరేదాకా జాగ్రత్తలు చెబుతూనే ఉన్నాడు ఆనందరావ్. వేగం అందుకుని ముందు కురికిన బస్సు, రెప్పపాటు కాలంలో కనుమరుగైన భర్త - దీర్ఘంగా నిట్టూర్పు విడిచింది కరుణ.

ఆనందరావ్ సమక్షంలో ఆమె మనసును తాకేందుకు భయపడే ఒంటరితనం అతను దూరం కాగానే భూతంలా ఆవరించింది. అతనికి ఆమె - ఆమెకు అతను - ఒకరికోసం మరొకరే తప్ప వాళ్ళిద్దరికీ కలిసి ఎవరూలేరు. క్షణానికో శిశువు పుట్టుకువచ్చే సువిశాల భారతంలో మాతృత్వపు మమకారాలకు నోచుకోలేని అతి కొద్దిమంది అభాగ్యుల్లో కరుణ ఒకర్తి.

ఆమె మనసుని తొలిచే ఆవేదనని దూరం చేసుకుందుగ్గాను చుట్టూరా సందడినైనా పంచుకోవా లనుకుంటే, ఆ మాత్రమూ ఆమెకి దక్కనివ్వనన్నట్లుగా రాత్రి సమయం నిశ్శబ్దంగా ఉంది.

నిరాశగా, నిర్లిప్తంగా నవ్వుకుంటూ సీటు వెనక్కి తలాన్చి కళ్ళు మూసుకుంది.

'ఈ రాత్రంతా మాత్రమే కాదు. వెళ్ళిన పనై తిరిగి వచ్చేదాకా ఒంటరితనం భరించాలి. తప్పదు. ఏకాంతంలో వెంటాడే ఆలోచనలూ, ఆలోచనలు రగిలించే ఆవేదనా లేకపోతే ఒంటరితనమేం భయంకరం కాదు. నిజమైన నరకం వీడని నీడల్లాంటి ఆలోచనల్లోంచే పుట్టుకొస్తుంది.'

ఒంటరితనంతో ఎలాగా అని బాధపడుతున్న ఆమెకు ఊరట కలిగిస్తూ వినిపించిందో పలకరింపు.

"కరుణా ! బావున్నావా?"

చీకట్లు అలవాటు పడ్డ కళ్ళకి స్పష్టాస్పష్టంగా కనిపిస్తున్న ముఖం, ముఖ్యంగా స్వరంలో ఆ మెత్తదనం.

"మీరు, మీరు...?" కరుణ గుర్తుపట్టి పట్టలేకుండా ఉంది.

ఆమె చిన్నగా నవ్వింది.

"నన్ను మరిచిపోయావా నువ్వు?"

"డాక్టర్ ! మీరేనా. ఎన్నాళ్ళ కెన్నాళ్ళకి?"

కరుణ సంభ్రమంగా అంది-

"ఎన్నాళ్ళు అనకు. ఎన్నేళ్ళు అను." సవరించిం దామె. "దాదాపు ఇరవై ఏళ్ళు. ఔనా?"

ఆమె కరుణను ఆరేళ్ళపాటు ట్రీట్ చేసిన డాక్టర్ జయాచంద్రన్. ఆమె సంపాదించిన వైద్య విజ్ఞానం మొత్తం ధారపోసి ప్రయత్నించినా కరుణను 'అమ్మా' అని పిలిపించుకునే అదృష్టానికి చేరువ చెయ్యలేకపోయింది. అందుకే జయాచంద్రన్‌కు కరుణంటే జాలీ, సానుభూతీ.


"ఎలా ఉంది, కరుణా, లైఫ్?"

"మామూలే డాక్టర్." కరుణ నవ్వింది వెలితిగా. "ఆశించింది అందుకునే అదృష్టం ఎలాగూ లేదు. కనీసం ఆశయాలన్నా సఫలీకృతం చేసుకుందా మనుకుంటే అందుకూ సహకరించదు ఈ ఆరోగ్యవంతం కాని శరీరం. ప్చ్ ! జీవితం జీవిత యోగ్యంగా లేదు డాక్టర్. జీవించక తప్పని బోర్‌లా ఉంది."

కరుణను జాలిగా చూసి మాట తప్పించింది జయాచంద్రన్.

ఆమె వయసు ఇప్పుడు అరవై సంవత్సరాలపైగా ఉంటుంది. ఇంకా ఈ వయసులోనూ ప్రాక్టీస్ ఎలా చేస్తూందో, వదలని బాధ్యతలు వృద్ధాప్యంలో కూడా తన నెలా నిలవనీక పరుగు తీయిస్తున్నాయో ఆమె చెప్పుకుపోతూ ఉంటే వింటూంది కరుణ.

"విసిగిపోతున్నాను, వేసారిపోతున్నాను, విశ్రాంతి తెలియని బ్రతుకైపోయింది. ఎప్పుడెప్పుడు ఈ బరువు వదిలించుకోగలనో అని ఎదురుచూస్తున్నానంటే నమ్ము కరుణా !" లాంటి వాక్యాలు ఉపయోగిస్తూ ఆమె చెప్తుండగా, ఆమె స్వరంలో వినిపించే తృప్తి, ఆ తృప్తి చాటున తొంగిచూసే గర్వం చెప్పక చెపుతున్నాయి. ఆమె ఆ బాధ్యతనీ, బరువునీ ఎంత ఆనందంగా మోస్తున్నదీ !




డాక్టర్‌గారు పక్క నుండటంతో ఒంటరితనం తెలియకుండా సాగిపోతూ ఉంది ప్రయాణం.

అర్ధరాత్రి దాటుతూ ఉండనగా మొదలయ్యాయి డాక్టర్ జయాచంద్రన్‌కు ఆవలింతలు.

"సారీ కరుణా ! నిద్ర వస్తోంది. గుడ్ నైట్" చెప్పేసి నిద్ర కుపక్రమించిం దామె.

పడుకున్న అయిదు నిముషాల్లోనే గాఢంగా నిద్రపోగలుగుతున్న ఆమెని ఆశ్చర్యంగా, అంతకు మించి అసూయగా చూసింది కరుణ.

'ఎంత అదృష్టవంతురాలు కాకపోతే ఇంత హాయిగా నిద్రపోగలదు !' కరుణ గుండె మడతల్లో మెలికలు తిరిగిన ఆవేదన.

నల్లటి ఆకాశంలో మినుకు మినుకు మంటున్న చుక్కల్లా కరుణకు అల్లంత దూరంలో నిలబడిపోయిన నిద్ర. కరుణ ఏ రాత్రీ నిశ్చింతగా నిద్రపోదు. నిరంతరం ఆమెను వెంటాడే అసంతృప్తి, ఆవేదన ఆమెను నిద్రకు సైతం దూరం చేసి వేధిస్తాయి.

పక్కనే ఉన్న జయాచంద్రన్ ఏళ్ళనాటి జ్ఞాపకాలని తిరగదోడుతుంటే కరుణ నిట్టూర్పులు విడుస్తోంది.

'ఒకవేళ, ఆ రోజు ఈమె మాట విని ఉంటే ఇవ్వాళ ఈ ఆవేదన నాకుండి ఉండేది కాదేమో !'

కరుణ విచ్చుకున్న రెప్పల మధ్య కదలాడుతున్న గత కాలపు నీలినీడలు.

పెళ్ళై అయిదేళ్ళు నిండినా కడుపు పండలేదు కరుణకు. పేరున్న గైనకాలజిస్టు జయాచంద్రన్ దగ్గరకు రెగ్యులర్‌గా ట్రీట్‌మెంట్‌కి వెళ్ళేది.

జయా నర్సింగ్‌హోమ్ అంటే కరుణకు తన ఇంటితో సమానం. అమ్మలా పలకరించి ఆదరించే డాక్టరమ్మ స్వంత మనిషిలా మారిపోయింది.

ఒక రోజు ఎప్పటిలా కరుణ నర్సింగ్‌హోమ్‌కు వెళ్ళింది. డాక్టర్‌గారు ఆ సమయంలో ఫ్రీగా ఉంటారన్నది తెలిసిన వ్యక్తి కావడంవల్ల సరాసరి కన్సల్టింగ్ రూంలోకి వెళ్ళిపోయింది. కానీ ఆ రోజు కరుణ వెళ్ళేసరికి జయాచంద్రన్ ఒంటరిగా లేదు. అది గమనించి వెనుదిరగబోయేంతలో వారించి కూర్చోమంది జయాచంద్రన్.

గదిలో వాతావరణం మామూలుగా లేదు. రోగి, వైద్యులకు సంబంధించిన సమస్యలా కాకుండా అంతకు మించిన దేదో - కరుణకు కొంచెం కొంచెంగా అర్థమవుతోంది.

జయాచంద్రన్ కెదురుగా కూర్చున్న మధ్య వయసు దంపతులు. తల్లి కుర్చీ నానుకుని తల దించుకుని నిలబడ్డ పద్నాలుగేళ్ళ పిల్ల. తల్లి ఏడుపూ, కోపం మిళితమైన స్వరాన్ని సాధ్యమైనంత తగ్గు స్థాయిలో బిగించి అంటోంది.

"పాడు పిల్ల. పాడు పిల్ల ! ఇంకా పసిదే అనుకున్నాం గానీ, ఇలా కొంప ముంచేస్తుం దనుకోలేదు డాక్టర్ ! ఇప్పు డీ సంగతి నలుగురూ వింటే మా పరువేం కావాలో మీరే ఆలోచించండి. మమ్మల్ని వీథిలో తలెత్తి తిరగనివ్వదు ఈ లోకం. ఇక లాభంలేదు. ముగ్గురం కట్టకట్టుకుని గంగలోనో, గోదావర్లోనో దూకి చావడంకన్నా మరో మార్గం లేదు."

నిస్సహాయత, దుఃఖం, కోపం - మూడు భావాలూ పెనవేసుకుని ఆమె గొంతుకను నొక్కుతున్నట్టుగా మాటల మధ్యలో వినిపిస్తున్న వెక్కిళ్ళు.

కరుణ ఆ పిల్లకేసి ఆశ్చర్యంగా చూసింది. అదేదో అద్భుతమన్నట్టుగా చూసింది.

'పరికిణీ జారుతున్నా చూసుకోలేని పసితనపు ఛాయలు ఇంకా వీడని ఈ పిల్ల... ఈ పిల్ల... మై గాడ్ !'

కరుణకు ఈర్ష్యలాంటి భావం కలిగింది.

'మింగని మందు లేదు. మొక్కని రాయి లేదు. అయినా నా కా వరం ప్రసాదించా లనిపించలేదు నీకు. అదృష్టమంటూ నేను భావించి కలవరించే మాతృత్వం ఈ పసిపాప కంటగట్టి అప్రతిష్ఠపాలు చేస్తున్నావా తండ్రీ?' అంటూ సృష్టికర్త ఎదురైతే నిలదీసి అడిగేయ్యాలన్నంత ఆవేశం.

కరుణ ఆలోచనల్లోంచి తెప్పరిల్లింది.

జయాచంద్రన్ పెద్ద వాళ్ళిద్దరినీ సమాధానపరుస్తోంది. "మీ రిద్దరూ చదువుకున్న వాళ్ళు. సంస్కారం ఉన్నవాళ్ళు. సమస్యను పరిష్కరించుకోడం తెలిసిన వాళ్ళు. మీకు నేను చెప్పగలదాన్నా? అయినా, ఏం జరిగిందో, ఎలా జరిగిందో, ఎందుకు జరిగిందో - ఈ జరిగిందానివల్ల జరగబోయే అనర్థం ఏమిటో అర్థంకాని అమాయకురాలు మీ అమ్మాయి. ఆమెను తిట్టి, కొట్టి, సాధించీ, ఏడిపించీ... మీరు పొందే దేముంది?"

"మరెలా డాక్టర్?" తండ్రి కూడా నోరు విప్పాడు. "జన్మనిచ్చిన మేము అమ్మాయికోసం ఆలోచిస్తాం. కానీ లోకులకేం పట్టింది? రేపు అందరిముందూ బయటపడితే... ఇది బ్రతగ్గలదా? దీన్ని బ్రతకనిస్తారా? బంగారు భవిష్యత్తు ముందున్న పసిది... ఏమైపోతుందో, ఎంత అల్లరిపాలవుతుందో..."

"బయట పడకుండా చెయ్యాలన్న మీ కోరిక నా కర్థమవుతోంది. కానీ సమయం మించిపోయింది. ఒకవేళ తెగించి మీ రన్నట్టుగా అబార్షన్ చేసినా పెద్ద ప్రాణానికి నేను గారంటీ ఇవ్వలేను."

జయాచంద్రన్ మాట విని వాళ్ళిద్దరూ ముఖాలు చూసుకున్నారు. తరువాత మూడు నిముషాల పాటూ తలలు దించుకుని మౌనంగా కూర్చున్నారు. తల్లి అంతవరకూ నిగ్రహించుకున్న కన్నీళ్ళు చెంపలపైకి జారిపోతున్నాయి. తండ్రి నిస్సహాయంగా చూస్తున్నాడు.

జయాచంద్రన్ వాళ్ళిద్దరివైపూ, వాళ్ళ వెనుక నిలబడ్డ అమ్మాయి వైపూ జాలిగా చూసింది.

'ఆ పాప పురిటిగుడ్డుగా తన చేతుల్లోనే ఊపిరి పీల్చుకుంది. ఇవ్వు డా పాప పురుడే ఒక సమస్యగా మారింది. కేవలం ఈ లోకంలోకి ప్రవేశమివ్వడం తప్ప... ఇంకేమీ చెయ్యలేనిదా, చేతగానిదా తను?'

ఆమె మౌనంలో... క్షణాలలో ఊపిరి పోసుకుం దో ఆలోచన.

"నన్ను నమ్మి, నా సహాయం కోరి వచ్చారు మీరు. అందుకే మిమ్మల్ని నిరాశపరచ ను. మీ కభ్యంతరం లేకుంటే అమ్మాయిని కొంతకాలం పాటూ నా దగ్గర వదిలి వెళ్ళండి. నేను కబురు పంపేదాకా నాతో ఉండనివ్వండి. మీ అమ్మాయిని మీకు జాగ్రత్తగా, మీరు కోరినట్టుగా మీ కప్పగించే బాధ్యత నాది."

"అంతకన్నానా డాక్టర్?" తల్లి తడికళ్ళు సంతోషంగా చూశాయి. "మీ రింత బాధ్యత స్వీకరిస్తానంటే మా కంతకంటే ఏం కావాలి?"

కరుణ చూస్తూండగానే అమ్మాయిని జయాచంద్రన్ దగ్గర వదిలి వెళ్ళిపోయారు ఆ భార్యా భర్తలు. కరుణ అటు తరువాత ఆ అమ్మాయిని చూడలేదు. ఆ విషయం అడగాలని ఎన్నోసార్లు అనిపించినా 'అనవసరమైన ఆసక్తి ప్రదర్శించడ మవుతుందేమో' - అన్న సంశయంతో అడగలేదు.

నెలలు గడిచాయి.

ఒక రోజు కరుణను తన ఇంటికి టీకి పిలిచింది జయాచంద్రన్. ఆరేళ్ళ పరిచయంలో అలా జరగడం మొదటిసారి.

కరుణ వెళ్ళేసరికి వరండాలోనే ఎదురైం దామె.

దాదాపు గంట గడిచాక జయాచంద్రన్ లోపల కెళ్ళింది. బయటకు వచ్చేటప్పు డామె చేతులు ఖాళీగా లేవు. పొదివిపట్టుకున్న పసిపాపడిని కరుణ ఒడిలో పడుకోబెట్టి నవ్వింది.

"కరుణా ! ఎలా ఉన్నాడు వీడు?"

ఆ బాబెవరో, ఎవరై ఉంటాడో ఊహించగలిగింది కరుణ. ముద్దుగా, బొద్దుగా ఉన్న పసివాడి బుగ్గల్ని తాకుతూ మనస్ఫూర్తిగా అంది.

"అదృష్టవంతుడు డాక్టర్ ! మీ చేతుల్లో పడ్డాడు."

"నువ్వు కావాలనుకుంటే ఈ అదృష్టం నీ దవుతుంది."

"డాక్టర్ !" కరుణ ఈ ప్రతిపాదన ఊహించలేదు.

"ఔనమ్మా ! నువ్వు తల్లి కాగల అవకాశా లెటూలేవు. కడుపున పుట్టిన బిడ్డలు మాత్రమే బిడ్డలవుతారా? మనసూ, మమత పంచి పెంచుకుంటే వీడు నిన్ను అమ్మా - అంటూ పిలవడా? నీ కొరత తీర్చడా?"

ఇంకా సందేహంగా కూర్చున్న కరుణ భుజంపైన చెయ్యి వేసిం దామె.

"ఆలోచించు కరుణా ! బాగా ఆలోచించు. వీడికి తల్లి ఉండీ లేదు. నువ్వు తల్లివి కాగల రాత నీకు లేదు. మీ రిద్దరూ ఒకరి కొకరవుతే తప్పు లేదేమో !"

కరుణ అప్పుడేమీ చెప్పలేదు. ఇంటి కొచ్చాక భర్త ఆనందరావ్‌తో ఆ విషయమై సంప్రదించనూ లేదు. తనకు తానుగా ఆ విషయమై ఆలోచించుకుంది కొంతకాలం. పసిపాపడి పట్ల కోరిక ఎంత తీవ్రతరమైనా... మనసు అందుకు అంగీకరించలేదు. పాలుగారే పసిడిబుగ్గల పాపడిలా కాక, వాడి పుట్టుక గురించి సందేహాలు వాణ్ణి వికృతంగా చూపించసాగాయి. ఏ వెధవ 'కోరిక'కు ప్రతిరూపమో? ఏ దుర్మార్గుడి 'దౌర్జన్యాని'కి ప్రతిఫలమో? ఏ కసాయి రక్తానికి ప్రతిబింబమో? సంప్రదాయమూ, సదాచారమూ అనుకుంటూ ఇన్నాళ్ళుగా కొన్ని విలువలకు కట్టుబడి బ్రతికిన తను ఇన్నాళ్ళకి, ఇవ్వాళ్టికి... కోరికకు లొంగిపోవాలా?''

కరుణ ఆలోచించే కొద్దీ సమ్మతి వైపుకంటే అసమ్మతివైపే మొగ్గసాగింది అంతరంగం.

తన సమాధానం కోసం ఎదురుచూసే జయాచంద్రన్‌కు ఎదురుపడి తన నిర్ణయం చెప్పగలిగే శక్తి లేనిదానిలా ఆ ఊరు విడిచిపెట్టేసింది.

ఆ తరువాత, మళ్ళీ ఇదే కలవడం. కరుణ తల తిప్పి డాక్టర్ వైపు చూసింది. పండిన వెంట్రుకల మీద పడుతున్న వెన్నెల వెలుగు... జయాచంద్రన్ మనసులా మెరుస్తోంది. నిద్రలో కూడా పెదవులపై పరుచుకున్న ప్రశాంతమైన నవ్వు చెదరలేదు.

'నిజంగా ఎంత అవివేకం తనది? అప్పుడు ఈమె మాటకి అవునని ఉంటే ఎంత బావుండేది? ఈ ఒంటరితనమూ, ఈ మనోవేదనా... అన్నీ మరిపించగల 'అమ్మా !' అన్న పిలుపు తన స్వంతం చెయ్యడానికి ఈ దేవత కరుణిస్తే మూర్ఖంగా కాలదన్నుకుంది.'

పోగొట్టుకున్న అదృష్టం తాలూకు కొసమెరుపు కరుణ కళ్ళలో తడి తడిగా ప్రతిఫలిస్తోంది.

చీకట్లను చీల్చుకుంటూ వస్తున్న ఉషోదయంలా దగ్గరవుతోంది గమ్యం.

రాత్రి నిశ్శబ్దాన్ని చెదరగొడుతూ పగటి సందడి నిద్రలేస్తోంది.

జయాచంద్రన్‌కు మెలకువ వచ్చింది.

''గుడ్మార్నింగ్ కరుణా ! అరె, అదేమిటి కళ్ళలా ఉన్నాయి? రాత్రంతా నిద్ర పోనేలేదా?'' కరుణ నవ్వి ఊరుకుంది.

కరుణకు ఆనాటి బాబు ఏమయ్యాడో అడిగి తెలుసుకోవాలని ఉంది. కానీ ఎంత ప్రయత్నించినా గొంతు పెగలడంలేదు.


ఏమంటుందో జయాచంద్రన్? 'నువ్వు కాదనుకున్న తరువాత వా డేమయితే నీ కెందుకు' అంటుందేమో?

తెల్లగా తెల్లవారే వేళకి ఊరు చేరింది బస్. జయాచంద్రన్ వెనగ్గా బస్ దిగింది కరుణ. ఆమె ఎవరికోసమూ ఎదురుచూడక్కర్లేదు. ఎవ్వరూ రారు.

జయాచంద్రన్ మాత్రం ఎవరో వస్తా రన్నట్టుగా చుట్టూ చూస్తోంది.

''దీనూ ! ఇక్కడ.'' జయాచంద్రన్ ఎవర్నో పిలుస్తోంది గట్టిగా.

కరుణ కూడా అటు చూసింది.




ఎత్తుగా, అందంగా ఉన్న పద్దెనిమిదేళ్ళ అబ్బాయి.

''హాయ్ మమ్మీ !'' డాక్టర్‌గార్ని చుట్టేశాడు దగ్గరకు రాగానే. ''నేను రాత్రే వచ్చి బస్ స్టాండ్‌లో పడుకున్నా తెలుసా?''

''నాకు తెలుసు - నువ్వంతటివాడివే !'' జయాచంద్రన్ నవ్వింది. ''అదిగో ఆ బాగ్ నువ్వే మొయ్యాలి. అవన్నీ నీకే !''

''ఏమిటీ, బుక్సేనా? థాంక్ యూ మమ్.''

చలాకీగా అంత బరువూ భుజాన వేసుకుంటున్న అతని వైపు కన్నార్పకుండా చూసింది కరుణ.

'తనకి తెలిసి జయాచంద్రన్ ఆఖరు కూతురు తనకంటే నాలుగేళ్ళు చిన్నది. మరి ఈ చిన్నారి కొడు కెవరబ్బా?'

కరుణ సంశయం తెలుసుకున్న దానిలా ఆమె వైపు చూసింది జయాచంద్రన్.

''కడుపున పుట్టిన వాళ్ళంతా రెక్క లొచ్చిన పిట్టలై నన్ను వదిలిపెట్టి దూరంగా ఎగిరిపోయారు కరుణా ! పిడికెడు ఆప్యాయత, గుప్పెడు మమత పంచిన పుణ్యానికి బదులుగా వీడు విడరాని బంధంగా నాకు మిగిలిపోయాడు. వాళ్ళందరూ నా ఆస్తికి వారసులైతే వీడు నా వృత్తికి వారసుడు. గుర్తుందా కరుణా నీకు?''

''మమ్మీ ! త్వరగారా !'' కారు స్టార్టు చేసి పిలుస్తున్నాడు దినకర్.

జయాచంద్రన్ కరుణవైపో చూపు చూసి కదిలి వెళ్ళింది.

కార్లో డాక్టర్ పక్కగా ఉన్న అబ్బాయి వైపు ఆశగా, ఆత్రంగా చూసింది ఆఖరుసారిగా కరుణ.

ఆనాడు ఒడిలో పడ్డ కలిమిని విదిలించికొట్టింది. ఇప్పు డా ఒలికిపోయిన అదృష్టం తనను వెక్కిరిస్తూ దాటిపోతూంది.

కరుణ నిట్టూర్పు నాపుకుంటూ ఆటో మాట్లాడి ఎక్కి కూర్చుంది. ఎంత కాదు కాదనుకున్నా... పదే పదే. నీటిచెలమ లవుతున్నాయి కళ్ళు.

కన్నీళ్ళు ఎన్ని రాలితే మాత్రమేం కరిగిపోయిన కాలం తిరిగి వస్తుందా?

*

# సృష్టి

చినుగులు పడిన
బతుకు చొక్కా వేలాడు తోంది
సమస్యల చిలక్కొయ్యకు...
రాలే కన్నీళ్ళను కళ్ళల్లోకి కుక్కుకొంటూ
కష్టాల గతుకుల రోడ్డు మీద ఈడ్చుకొంటూ నన్ను నేను.

ఈ దారి ఏ వైపుకో..?
నా బతుకు ఏ మలుపుకో..?

ఆకలి ఆబోతులు కడుపులో కుమ్ముతుంటే
కాళ్ళల్లో సత్తువ నేల గరచి పోతుంటే
సుళ్ళు తిరుగుతోంది కళ్ళల్లో ఆకాశం..

ఎండుకు పోయి తడి చచ్చిన పెదాల పైన
ముద్దిడుతూ నిర్లిప్తతా వయ్యారి...
అసహాయతా అవమానాల సమ్మెట పోట్లకు
ముక్కలు ముక్కలుగా పగిలి పోతూ గుండె నాపరాయి...

కునుకు పడితే చాలు
కలల తొక్కిన లాటలో ఊపిరి సలపక తన్నుకు లాడుతూ...
బలవంతంగా హత్యా చేయబడుతున్న
కోర్కెల విరిబోడులు
రాశులు రాశులుగా పోగిడుతున్నాయి బతుకు దిబ్బమీద..

వ్యథాకులిత మనస్కుడనై
జీవన పాత్ర బట్టుకొని ఉన్మాదిలా చరిస్తూ...
మొండి కేసి కదలని కాలం ముందు
గత స్మృతుల్ని తలపోసుకొంటూ....

బతుకు బతుకంతా
విషాదమయ పాత్రలో పరిభ్రమించడమే నా ప్రవృత్తి...

ఇక ఈ కథకు భరత వాక్యం పలకాలి.
సరి కొత్త కథకు సృష్టి జరగాలి.
బతుకు నవోదయమై
వెలుగు పూరేకులను విప్పుకోవాలి...

అవనిగడ్డ సూర్య ప్రకాష్